# రాఖీ

— పి.జమున



"ఏమండీ...ఏమండీ..."అంటూ గిరీశం ఒకతన్ని ఆపి - మీ పేరు గిరీశమా?- అని అడిగాడు.

"అవునండీ...అయితే అందరు గిరి అని పిలుస్తారు కాబట్టి అందరికి నా పేరు గిరీశం అని తెలియదు"అన్నాడు.

"సారీ...ఉదయం పోస్ట్‌లో రెండు ఉత్తరాలు గిరీశం పేరు మీద వస్తే నేను ఓపెన్ చేసి చదివాను."

"అంటే మీ పేరూ.గిరీశమా?" అంటూ ఆగాడు.

"అవునండీ...ఇంటిపేరు వ్రాయకుండా మిస్టర్ గిరీశం అని వ్రాసినందువల్ల వచ్చిన పొరపాటు. నేను చదివిన దానికి క్షమించండి." అని నొచ్చుకుంటూ అలా పార్క్‌కు వెళ్ళి కబుర్లు చెప్పకుందాం అని చెప్తూ, వెళ్ళి పార్కులో కూర్చుని, "రెండు ఉత్తరాల్లో ఒకటి సొంత అక్కయ్య వ్రాసిన ఉత్తరంగా వుంది. మరొకటి చెల్లెలు లాంటి దాన్ని అంటూ వ్రాసిన ఉత్తరంగా వుంది"అన్నాడు.

"చదివారు కదా! విషయం ఏమిటి?" అని అడిగాడు.

"మీరే చదవండి. నేను చదవడం తప్పుగా భావిస్తూవుంటే; విషయం నేనెలా చెప్పేది?" అంటూ రెండు ఉత్తరాలూ ఇచ్చాడు ఈ గిరీశం ఆ గిరీశానికి.

సుశీల వ్రాసిన ఉత్తరం తీసి చదవడం ప్రారంభించాడు.

తమ్ముడూ, నీకు రాఖీ పది సంవత్సరాలుగా కడుతున్న తనూజకు పెళ్ళి కుదిరింది. వాళ్ళు చాలా పేద వాళ్ళు. నీకు రాఖీ కట్టింది అంటే, అర్థం నీవు ఏదైనా ప్రెజెంటేషన్ యిస్తావనే ఆశతో రాఖీ కట్టిందే కాని నలుగురు అన్నయ్యలు ఉండి కూడ అన్నయ్యలకు కరువు అయినట్లు నీకేమిటి రాఖీ కట్టడం? అందుకని నీవు ఈ లెటర్ చేరిన వెంటనే రూ. 5,000/- పి.ఎఫ్. లోన్ వేసి ఆ అమ్మాయికి పంపవలసినది. మన దక్షిణాదిన రాఖీ అంటే ఏమిటో ఒకప్పుడు మనకు తెలిసేది కాదు. ఉత్తరాది వైపు రాఖీ (రక్షాబంధన్) వాళ్ళు చేసుకున్నట్టు మనం చేసుకోం అంటూ ఉత్తరం ముగించింది.

"ఏమిటీ...ఉత్తరం చదువుతూ మొహం అలా పెట్టారు?"అని అడిగాడు గిరీశం.

"ఏం లేదూ, ఏదో గుర్తువచ్చింది. ఆలోచిస్తున్నాను" అంటూ ఇద్దరు అక్కడి నుండి నిష్క్రమించారు.

ఇంటికి వచ్చి భార్యతో విషయం అంతా చెబుతూ, ఈ గిరీశం పెళ్ళి చేసుకున్న ఈ అమ్మాయి ఒకప్పుడు అతనికి రాఖీ కట్టినదట. దాన్ని లెక్క చేయకుండా ఇద్దరూ పెళ్ళిచేసుకున్నారు. అదే ఆ అమ్మాయికి ఏదో సంబంధం దూరపు చుట్టంలో చూస్తే ఇష్టం లేదని నాన్నతో చెబితే, ఆయన వాళ్ళతో చెప్పడాన్కి మొహమాటపడి షాప్‌లో నుండి రాఖీ ఒకటి తెచ్చి కూతురుకిచ్చి,"అతను భోజనానికి వస్తాడు...వచ్చిన వెంటనే రాఖీ కట్టి లోపలకు వెళ్ళు. చదువుకున్నవాడు అర్థం చేసుకుంటాడని చెప్పారట. ఆ అమ్మాయి ఆ విధంగా చేసింది.

"తరువాత ఆ అమ్మాయి నాన్నగారు ఆ అబ్బాయికి ఉత్తరం రాస్తూ — మా అమ్మాయి నిన్ను తన అన్నగా భావించిదట కాని జీవిత భాగస్వామ్యం చేసుకునే ఉద్దేశ్యం లేదని నన్ను వ్రాయమన్నది అంటూ ఉత్తరం వ్రాశారట."

"ఎందుకండీ...ఈ అలవాట్లు లేని పనులు.

మన ఆంధ్రా వైపు లేనేలేదు. మనం పుట్టింది మొదలు ఈ విధంగా ఈ వైపు చేసిందే లేదు!"

"అందుకేనోయ్...ఆ గిరీశానికి ఆ ఉత్తరం చదువుతూ వుంటే మొహం ఎలా పెట్టాడో నా ఒక్కడికే తెలుసు.

"లేకుంటే ఒకప్పుడు అతని భార్య గిరీశాన్ని అన్నగా భావించిందట. ఒక వయస్సు వచ్చిన తరువాత అతన్ని అన్నగా వూహించలేక పోయిందట. ఈ అమ్మాయి ఏం చదువుకున్న పిల్ల? ఈ అమ్మాయి తండ్రి ఈ అమ్మాయిని మాత్రం చాలా చదువుకున్న అమ్మాయి అనుకున్నట్లున్నది. ముక్కుమొహం తెలియని ఇంకొకమ్మాయి అన్నగా భావించి రాఖీ కట్టినదట. ఇదంతా కాదు. అవసరానికి తగ్గట్లు పద్ధతులు మార్చుకోడానికి ఈ రాఖీ పండుగ. చాలా బాగుంది కదూ! అందుకే ప్రతి సంవత్సరం రాఖీ పండుగ నాడు నాకు ఈ సంఘటన గుర్తు వస్తూనే వుంటుంది"అంటూ ఇద్దరూ నవ్వుకుంటూ లైటార్పి పడుకుంటూ "నిజంగా మనకు రాఖీ అంటే ఏమిటో తెలియనిదే మంచిదైంది, లేకుంటే నీవు నాకు కట్టి వుంటే హతోస్మి" అంటూ నవ్వుకుంటూ పడుకున్నాడు.

